క్లుప్తంగా

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

నాతవరం : గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామని నాతవరం ఎస్‌ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో లింగంపేట పంచాయతీ శివారు కొత్తరామచంద్రపురం గ్రామ సమీపంలో ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుండగా పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 13 మద్యం క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఘనంగా మరిడితల్లి జాతర

గొలుగొండ : మండలంలో జోగుంపేట, కొత్త జోగుంపేట, శ్రీరాంపురం, జోగంపేట 80 ఎస్సీకాలనీ తదితర గ్రామాల్లో గురువారం మరిడితల్లి జాతర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న ఆలయాల వద్ద భక్తులు తెల్లవారు నుంచి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. రాత్రికి అమ్మవారి ఊరేగింపు నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అమ్మపేట గ్రామంలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్యామ్‌కుమార్

గొలుగొండ : అమ్మపేట గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో సుమారుగా 60 మంది రోగులను తనిఖీ చేసి మందులు ఇచ్చారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు, నదుల్లో పుష్కలంగా నీరు



వర్షాలకు వంటర్లపాలెం చెరువులో చేరిన నీరు

మాడుగుల రూరల్ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో తాచేరు, శారద నదుల్లో నీరు చేరింది. దీంతో పాటు చెరువుల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాల వల్ల ఇటీవల వేసిన ఖరీఫ్ వరినాట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే కూరగాయలు పంటలు బాగా పండుతాయని హర్షం వ్యక్తం చేశారు.

16న మండల సమావేశం

నాతవరం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 16వ తేదీన ఏర్పాటు చేశామని డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు మండల స్థాయిలో గల అన్ని శాఖలు అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

వినాయక మండపం వద్ద దీపారాధన



శివలింగాకారంలో వినాయకుడు

కె.కోటపాడు : వారాడ గ్రామంలో వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతులతో శివలింగాకారంలో వినాయకుని దీపాలతో అలంకరించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వినాయక యూత్ కమిటీ సభ్యులు గిడుతూరి అప్పారావు, దొగ్గ నాగరాజు, లెక్కల జగ్గునాయుడు, దొగ్గ రాజు పాల్గొన్నారు.

శోభాయాత్రకు తరలిన బీజేపీ నేతలు

మాకవరపాలెం: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్రకు నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టారు. అనకాపల్లిలో జరిగిన బీజేపీ శోభాయాత్రకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీరంరెడ్డి సూర్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆడిగర్ల రాంబాబు, మండల బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు మర్రి నాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

ఉచిత బస్సు...ఊపిరాడదు..!

- ఎక్స్‌ప్రెస్ బస్సుల రద్దీతో కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు
- పల్లెవెలుగు బస్సులు నడపాలని వేడుకోలు



కె.జె.పురం మీదుగా నడుపుతున్న బస్సులు



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కుతున్న కళాశాల విద్యార్థినులు

మాడుగుల రూరల్: విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నది మీద తాత్కాలిక వంతెన గత నెలలో భారీ వర్షాలకు కొట్టుకుని పోవడంతో మండలంలో పలు గ్రామాల నుంచి చోడవరం, అనకాపల్లి, ఇతర ప్రాంతాలకు వెళ్లే కళాశాల విద్యార్థులు, వ్యాపారులు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి జిల్లా పాడేరు, తదితర ప్రాంతాల నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులు పాడేరు ఘాట్ రోడ్డు నుంచి కె.జె.పురం గ్రామం మీదుగా, అప్పలరాజుపురం, జైతవరం, ఉప్పరగూడెం, వరాహపురం, చోడవరం మీదుగా విశాఖ, అనకాపల్లి బస్సు సర్వీసులు నడుపుతున్నారు. విశాఖ, పాడేరు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు పాడేరు నుంచి రావడంతో అక్కడ నుంచి సిట్టింగ్‌తో ప్రతి బస్సు వస్తున్నాయి. దీంతో ఘాట్‌రోడ్డు వచ్చేసరికి బస్సులు ఖాళీ లేక ఉదయం సమయంలో కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రూట్‌లో అనకాపల్లి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు సర్వీసులను నడపాలని కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. అనకాపల్లి డిపో నుంచి మాడుగులకు రెండు హైర్ విత్ బస్సులతో పాటు నాలుగు డిపో బస్సులు గతంలో అనకాపల్లి నుంచి మాడుగులకు నడిపేవారు. గత నెల రోజుల నుంచి తాత్కాలిక కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఈ బస్సులను పూర్తిగా రద్దు చేశారు. అనకాపల్లి డిపో నుంచి కింతలి, జాలంపల్లి బస్సు సర్వీసులను అనకాపల్లి నుంచి కూండ్రం, రాజాం, బుచ్చెయ్యపేట, వడ్డాది నుంచి జాలంపల్లి బస్సు వీరనారాయణం మీదుగా, కింతలి బస్సు ఘాట్‌రోడ్డు మీదుగా నడుపుతున్నారు. ఈ బస్సుల వల్ల కళాశాల విద్యార్థులకు ఎటువంటి ఉపయోగం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే రాత్రి సమయంలో అనకాపల్లి నుంచి మాడుగుల నైట్‌హాల్ట్ బస్సులు కూడా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికుల కష్టాలు పట్టించుకోవాలి...



కె.జె.పురం మీదుగా నడుపుతున్న బస్సు సర్వీసులను కె.జె.పురంలో ఆపడం లేదు. ఈ గ్రామం నుంచి నిత్యం కళాశాల విద్యార్థులు 50 మంది ఉంటారు. వీరితో పాటు చోడవరం, అనకాపల్లి, విశాఖ, వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ప్రతి బస్సు పూర్తిగా రద్దీగా ఉంటుంది. కె.జె.పురం గ్రామంలో పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖ వెళ్లే ప్రతి బస్సును నిలుపుదల చేయాలి. ప్రయాణికుల కష్టాలు తెలుసుకోవాలి. బస్సులు నిలుపుదల చేయకపోవడం వల్ల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

–పరిమి కాసుల జగ్గారావు, కె.జె.పురం, మాడుగుల మండలం

పల్లె వెలుగు బస్సులు నడపాలి



కళాశాల విద్యార్థుల కోసం అయినా సరే ఆర్టీసీ వారు బస్ సర్వీసులను కేజేపురంలో నిలుపుదల చేయాలి. కె.జె.పురం బస్ స్టాపు లేదని అక్కసుతో బస్సులు నిలుపుదల చేయడం లేదని తెలిసింది. కనీసం గ్రామం మీదుగా ఉదయం, సాయంత్రం సమయంలో పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడపాలి.

–కాళ్ల రాము, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, కె.జె.పురం, మాడుగుల మండలం

ఆటోడ్రైవర్ల ఆందోళన



రావికమతంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయు సభ్యులు

రావికమతం : ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు.మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలో గురువారం ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయు నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలకు బేరాలు లేక, ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద తెచ్చిన అప్పులు చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి మాట్లాడుతూ ఏటా వాహనమిత్ర పథకం కింద రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రావికమతం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కె.వరహాలబాబు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్లు ఆదాయం లేక రోడ్డున పడ్డారని, ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్.సోమునాయుడు, సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఎం.కె.వల్లాపురం సొసైటీకి యూరియా ఇవ్వరా?

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కె.వల్లాపురం సహకార సంఘానికి యూరియా ఎరువులు పంపిణీ చెయ్యరా? అంటూ వైఎస్సార్‌సీపి నాయకుడు, ఎం.కోటపాడు ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ అధికారులను నిలదీశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సహకార సంఘానికి రెండు నెలల క్రితం 10 టన్నుల యూరియా అందించారని, నాటి నుంచి నేటి వరకు యూరియా పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు తప్ప ఇవ్వడం లేదన్నారు. సొసైటీ పరిధిలో 9 గ్రామాల రైతులు యూరియా లేక ఇక్కట్లు పడుతున్నారన్నారు.

నేటి నుంచి వెంకన్న పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వరాలయం

రోలుగుంట : స్థానిక శ్రీ వేంకటేశ్వరాలయంలో ఈ నెల 12 నుంచి 14 తేదీ వరకూ మూడు రోజుల పాటు పవిత్రోత్సవం నిర్వహించనున్నట్టు అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని పూజకార్యక్రమాల కోసం ఆలయ కమిటీ వారు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 12న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విష్వక్సేన పూజ, అంకురార్పణతో ప్రారంభమవుతాయన్నారు. 13 శనివారం ఉదయం 9 గంటలకు పవిత్రముల సమర్పణ, ముగింపు రోజు 14 ఆదివారం ఉదయం అష్టోత్తర కలశాలతో అభిషేకం జరుగుతుందని తెలిపారు. మల్లెమొగ్గ దండవలె పసుపునూలుతో హారములు చేసి స్వామివారికి సమర్పించే ఈ ఉత్సవాన్ని ఆషాఢ మాసం మెదలు కార్తీక మాసం లోపల ఏ నెలలోనైనా త్రయాహ్నికంగా జరుపుకోవచ్చని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ పవిత్రోత్సవంలో పాల్గొనే భక్తుల దోషాలు తొలగి మంచి జరుగుతుందన్నారు.

ఘనంగా మరిడమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం : మండలంలో గన్నవరం గ్రామంలో గల మరిడమ్మ తల్లి పండగను భక్తులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులు అమ్మవారిని గ్రామ దేవతగా పూజించడం పూర్వం నుంచి సంప్రదాయంగా వస్తుంది. ఈ ఏడాది కూడా భక్తులు గురువారం తెల్లవారు నుంచే భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శించుకుని పసుపు కుంకమ జాకెట్ ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉచితంగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో మహిళతో కోలాటం భజనలు ఏర్పాటు చేశారు.

డ్రైనేజీల్లో పూడికతీత

మాడుగుల: శంకరం పంచాయతీలో మురుగుకాల్వల్లో పూడికతీత పనులు సర్పంచ్ శోలం రమేష్, పంచాయతీ, ఎన్.నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు.

బ్యాంకు సేవలు తెలుసుకోండి



సదస్సులో పాల్గొన్న బ్యాంకుల మేనేజర్లు

మాకవరపాలెం : బ్యాంకు సేవలు, లావాదేవీలపై అందరూ అవగాహన కలిగిఉండాలని యూనియన్, స్టేట్ బ్యాంకుల మేనేజర్లు రాణి, చంద్రరావు అన్నారు. తామరంలో గురువారం బ్యాంకింగ్ సేవలు, లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రాంలో వారు మాట్లాడుతూ ప్రతి ఖాతాదారు నగదు రహిత లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, వెలుగు ఏపీఎం మంగ, గొంతిన హరిబాబు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జానకీరాంపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా మహరాజ్

రోలుగుంట : జానకీరాంపురం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జిగా బలిజి మహరాజ్ నియమితులయ్యారు. ఇతను ఇప్పటి వరకూ జనసేన మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. రైతుల అభివృద్ధికి తన సేవలు విస్తృత పరుస్తానని ఈ సందర్భంగా అన్నారు.

పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు ఐ స్క్రీనింగ్ నిర్వహిస్తున్న కంటి సిబ్బంది

కె.కోటపాడు : విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో విద్యార్థులకు గురువారం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య సిబ్బంది ఐ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంప్‌ను ఖాసిమ్ ప్రారంభించారు. కంటి వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. స్మార్ట్‌ఫోన్‌ను అధికంగా ఉపయోగించి కంటి సమస్యల బారిన పడరాదని హితవు పలికారు. క్యాంప్ కోఆర్డినేటర్ హరీష్‌వర్మ, జె.కృష్ణారావు, ఎం.రవి పాల్గొన్నారు.

పాత పెన్షన్ వర్తింపజేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం : పాత పెన్షన్ వర్తింపజేయాలంటూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆందోళన నిర్వహించారు. డీఎస్సీ 2003 ఫోరం నాయకులు చుక్కల రాము, డి.వి.ఆర్.మూర్తి, కనక మహాలక్ష్మి, ఆశోక్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ వర్తింపజేయాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో ప్రభాకర్, హరికృష్ణ, శ్రీరామ్మూర్తి, చిక్కాల శ్రీను, సతీష్, మల్లునాయుడు, కె.రాము, వరహాలబాబు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల నిరీక్షణ



కె.జె.పురం సచివాలయం గేటు ముందు రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న రైతులు

రావికమతం : బస్తా యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతన అనుభవించారు. మండలంలో టి.అర్జాపురం రైతు సేవ కేంద్రంలో గురువారం యూరియా పంపిణీ చేపడుతున్నట్టు తెలుసుకున్న రైతులు ఉదయం 8గంటలకే అధిక సంఖ్యలో చేరుకున్నారు.మండు టెండలో క్యూలైన్‌లో గంటల తరబడి బారులు తీరారు. అయితే రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం రైతు సేవా కేంద్రానికి యూరియా రావడంతో గురువారం ఉదయం స్థానిక 2 వ సచివాలయంలో ముందస్తుగా రైతులకు రిజిస్ట్రేషన్ చేశారు. గురువారం ఉదయం నుంచి రైతులు సచివాలయానికి వచ్చి ముందస్తుగా యూరియా కోసం తమ పేరు నమోదు చేసుకుని నగదు చెల్లించారు. శుక్రవారం ఆర్ఎస్‌కే వద్ద యూరియా బస్తాలు అందజేస్తామని ఏవో అనసూయ తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శులకు సత్కారం



సన్యాసిపాత్రుడు, రామారావులను సత్కరిస్తున్న ఉమాశంకర్‌గణేష్



ఏడువాక సత్యారావును అభినందిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నాయకులు

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావులను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సత్కరించారు. ఇటీవల పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్యాసిపాత్రుడు, రామారావులను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించారు. దీంతోపాటు సన్యాసిపాత్రుడుకు విశాఖ ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల పరిశీలకుడిగా, రామారావును నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాల పరిశీలకుడుగా బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో మాకవరపాలెంలో గురువారం వీరిద్దరినీ ఉమాశంకర్‌గణేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ సర్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, నియోజవర్గంలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావుకు పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల అదనపు బాధ్యతలతో నియమించడంపై ఆ పార్టీ శ్రేణులు అభినందించాయి. గోవాడ గ్రామానికి చెందిన సత్యారావు నియామకంపై మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పార్టీ నాయకులు సత్యారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, పార్టీ నాయకులు పందిరిశ్రీనివాసరావు, బొడ్డు శ్రీరామ్మూర్తి, దేవరపల్లి సత్య, వేచలపు ప్రకాష్, పల్లా ధనాజీ పాల్గొన్నారు.

15న చలో విజయవాడ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

నర్సీపట్నం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ ఈ నెల 15న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన పథకాలు కార్మికులకు అందటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వారిని మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీపై మాట తప్పటం వల్లే ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. కోట్లాది రూపాయలు సంక్షేమ బోర్డులో ఉంటున్నప్పటికీ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ అవసరాలకు నిధులను ఉపయోగించుకుంటుందన్నారు. కార్మికులు ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి డి.శివ పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు



వివాహిత రామతల్లి

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన వివాహిత మాకిరెడ్డి రామతల్లి(43) అదృశ్యంపై ఆమె భర్త రాజు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ఆమె నర్సీపట్నంలో ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. దాంతో ఆందోళన చెందిన భర్త తన బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆమె జాడ లేకపోవడంతో రోలుగుంట పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.రామకృష్ణారావు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని కె.కోటపాడు ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసన వారంలో భాగంగా గురువారం నల్లబాడ్జీలతో మండలంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు ఐఆర్ విడుదల, పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాఠశాలలో ఎసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని, హెల్త్ కార్డుల పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు సూర్రెడ్డి బాబూరావు, బోకం లలిత ప్రసాద్, కిలపర్తి శ్రీనివాసరావు, రాళ్లపల్లి దేముడుబాబు, మల్లాది కామేశ్వరరావు, లెక్కల గణపతి నల్లబాడ్జీలతో పాల్గొన్నారు.

ల్యాబ్ నిర్మాణానికి స్థల పరిశీలన



బీపీహెచ్ యూనిట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు, వైద్యాధికారి

దేవరాపల్లి : దేవరాపల్లి పీహెచ్‌సీని ఏపీఎంఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) ఇంజినీరింగ్ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ ఎ. నాగేశ్వరరావు, జేఈ ఎస్.నరేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘనలతో కలిసి ప్రస్తుత పీహెచ్‌సీ భవనం, నూతనంగా నిర్మాణంలో ఉన్న అదనపు భవన స్థితిగతులను పరిశీలించారు. అదనంగా అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. స్థానిక పీహెచ్‌సీకి రూ.50 లక్షలతో బీపీహెచ్ యూనిట్(ల్యాబ్) మంజూరైందని, ఈ ల్యాబ్ భవన నిర్మాణానికి సంబంధించి పీహెచ్‌సీ ఆవరణలో స్థల పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. వీరి వెంట హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్ ఉన్నారు.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లిలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

దేవరాపల్లి: దేవరాపల్లిలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాసి ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. మధ్యాహ్నం ఒక్కసారి వాతావరణం చల్లబడి దేవరాపల్లి సహా కాశీపురం, నాగయ్యపేట, సీతంపేట, రైవాడ తదితర గ్రామాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటి మునిగాయి.